

# ఫూల్

"ఎ ఫూల్ అండ్ హిజ్ మనీ మస్ట్ పార్ట్" అని యింగ్లీషు సామెత. మా వూళ్లో మౌలా అనే ముస్లిమ్‌కి పూలతోట వున్నది. గ్రీష్మంలో, వసంతంలో హుషారుగా మధ్యాన్నం నించే పూల అమ్మకం మొదలు పెట్టి, మారు బేరగాళ్లకీ అమ్మి, తానూ వూళ్లో తిరుగుతూ, "చేమంతీ ఫూల్! మల్లీ ఫూల్, జాజి ఫూల్, జడ మొగ్గా, పెద్ద జాజీ అని కేకలేస్తూ" పూలన్నీ అమ్మేసేవాడు. లెక్కించీ అమ్ముతాడు, తూచీ, అమ్ముతాడు, మూరతో కొలిచి మాల కట్టినదండా అమ్ముతాడు. నూరు పూలకీ అయిదు పూలు కొసరుతాడు. అది రివాజు. జడ మొగ్గతో వంకీల జడా, పెద్ద జడా వేసి నేర్పు చూసి ఆనందిస్తారు స్త్రీలు. మౌలా తానే కాగితం జడ ఆకారంలో కత్తిరించి, ఆకులు వేసి కుట్టి దానిమీద పెద్ద జడ తయారు చేసి అమ్ముతాడు. అర్ధరివ్వాలి మధ్యలో తళుకురేకులు రంగులవి నక్షత్రాల్లాగా కత్తిరించినవి కుట్టితే యింకా అందం. చీపురుపుల్లకి పూలు అడ్డంగా యెక్కించి సూది గుచ్చి దారం మీదికి లాగి జడమీద పెట్టి, రెండువేపులా కుట్టి తెస్తారు. అలా గుండు మల్లెరాదు. దొంతర మల్లె రాదు. పొడుగాటి కాడవున్న మొగ్గే వస్తుంది. పొద్దూకగానే విచ్చిన మల్లెలు కట్టనా అని అమ్ముతాడు. యెనిమిది, ఆరు, పది దండలు కలిపి కొబ్బరాకు వుంచి చీపురుపుల్ల చీల్చి గుచ్చితే పట్టుకోటానికి వీలు చౌక. మాల కట్టే బాధ వుండదు. కత్తెర దండా తయారుచేస్తారు చిక్కగా. దవనం మరువంతో కలిపీ కట్టుతారు.

ఫూల్ అంటే ఆంగ్లంలో ప్రపంచజ్ఞానం లేనివాడు అని అర్థం. ఫూల్ అనిపించుకుంటే అవమానమే. మోసపోయిన వానినీ ఫూల్ అంటారు.

దీనానాథ్ పేరు నిజం చేసే దయాశాలి. చెడు వూహించడు. పరోపకారార్ధ మిదం శరీరం అని నవ్వుతాడు. వార్నింగ్ చెవిన వేసుకోడు. ప్రేమగా "వాడొట్టి ఫూల్" అంటారు దీనానాథ్‌ని, బంధువులు, మిత్రులూ గూడా. శ్యామ సుందరి బంగినపల్లి మామిడి పండులాగా, నోరూరిస్తూ ఆకర్షిస్తుంది. కాని ఆమె నోటి

దుడుకుకి వెరిచి తప్పించుకు తిరిగేవాళ్లే యెక్కువ'' సుంది నోరా మహచెడ్డది. తిక్క రేగితే సుందినోరు మూతపడదు. ఆమె జోలికి వెళ్లకుండా వుండటమే వుత్తమం'' అని ఒకరంటే ''సుంది నోరేం, చేతలూ అంతే సైకో సుంది అంటే లోపల బెదురే అందరికీ'' అని మరొకరు వాఖ్యానిస్తారు. దీనానాధ్ సిక్‌లీవ్ మీదున్నాడు. శ్యామ సుందరిని నోటీస్ చేశాడు. '''పాపం'' అనుకున్నాడు. మందు తీసుకుంటే ఆ వైకల్యం తగ్గిపోతుందనీ, తిలోదకాలిచ్చిన మంచి జాబ్ మళ్లా చేసుకుంటుందనీ అనుకున్నాడు. ఆశించాడు. సిక్ లీవ్ యెలా యిచ్చారంటే, దీనా ప్రభుత్వ వాహనంలో వెళ్తుంటే మందుపాతర పేలి వాహనం తిరగబడి నిప్పంటుకున్నది. అదే వాహనంలో వున్న ముగ్గురు రక్షణశాఖ అధికారులూ డ్రైవ్‌చేస్తున్న డ్రైవరూ పరమపదం చేరారప్పుడే. ఒళ్లంతా గాయాల్తో, కొనవూపిరితో హాస్పటల్లో చేర్చబడ్డాడు దీనానాధ్. సహాయం చేయ వచ్చినవారికి దీనా తెలుసు. స్నేహశీలి, నిజాయితీ, ప్రమాదించే అమాయకత్త్వం కలవాడిగా తెలుసువారికి.

తెలివి వచ్చి, లేచి తిరగగలగంగానే సిక్ లీవ్ యిచ్చి యింటికి పంపేశారధికారులు.

దీనానాధ్ చిన్నప్పుడు చిన్నమ్మమ్మ యింట్లో పెరిగాడు. అమ్మమ్మ కూతురు పిన్ని కరుణ దీనా యిదే. ఆడుతూ పాడుతూ పొలాల్లో ఆడారిద్దరూ. కలిసి ప్రైమరీ స్కూల్ కెళ్లారు. విడిపోయారు. పిన్నికి పెళ్లి అయింది. విడో అయింది కాలం గడుస్తుండగా. అందర్నీ చూసివస్తూ అవసరానికి సాయపడటం అలవాటు పిన్నికి. దీనా సిక్ లీవ్ మీద వచ్చాడని విని వచ్చింది. దీనా కళ్లు సుంది మీద వాలి మరోవేపు తిరక్కపోవటం గమనించింది కరుణ పిన్ని. పిన్ని వేలు విడిచిన మేనమామ బంగారం చేయబోయి బైరాగి అయి తత్త్వవేత్త అయినాడు. తత్త్వాలు పాడుతూ పిన్నికి వినిపిస్తూ పిన్నికీ అలవడేట్టు చేశాడు. ఒక తత్త్వంలో విషయం పిన్నికి నచ్చింది. మంచి తెలిసీ చెప్పకపోతే, తరవాత బాధ కలుగుతుంది. అయ్యో తెలిసీ చెప్పలేదే చెపితే వినేవాడేమో. అందుకని వినకపోయినామంచి

చెప్పేయాలి. దీనాకి భోజనం పెడుతూ పిన్ని.

''దీనా! నీ తరహా బాగా లేదు. అనవసర విషయంలో కలగజేసుకోకు. సుందికి చిన్నప్పుడే కొంత వెర్రి వున్నది. పెద్దవుతూ వుండగా నరాల బలహీనం యేర్పడి, కదుల్తూ నవ్వుతూ అతిగా వాగేది. ఆ జబ్బు వున్నవాళ్లకి తరవాత తరవాత శ్చిజోఫర్నియా తాకుతుందని డాక్టరు చెప్పాడు. మధుమేహం వచ్చినవారికి గుండెపోటు వస్తుంది చూడు అలా అన్నమాట. అది జాతక చర్య అన్నాడు వాళ్ల నాన్న జ్యోతిష్కుడు. పర్సనల్ వైద్యుడు, హార్ట్ స్పెషలిస్ట్ అయిన భర్త హెలికాప్టర్ ప్రమాదంలో పోయినప్పుడు, సుందికి షాక్ తాకిందన్నారు. మళ్లా నార్మల్‌గా వుండి జాబ్ చేసుకుంటాననంటే వాళ్ల నాన్న మంచి జాబ్‌లోనే యిరికించాడు. డిగ్రీ వుందిగా సుందికి. నీ మానాన నువ్వుండు దీనా. అది అంటువ్యాధేమోనని నా భయం. ధైర్యం అంటు వ్యాధి అంటారు కవులు. మెరిసేదంతా బంగారంగాదు. మేడిపండు చూడమేలిమై వుండునూ పొట్టవిచ్చి చూడ పురుగులుండు అన్నాడు ప్రజాకవి'' అన్నది. దీనానాధ్‌కి ఆ స్టైల్ నచ్చింది కాని అదేదో నీతి కధ వింటున్నట్టు తలవూపుతూ నవ్వుతూ విన్నాడు. భోజనమైంది.

''బుర్రలో కెక్కలేదు విన్నది'' అనుకుని టేబిల్ తుడుస్తున్న పిన్ని తనపేరు బిగ్గరగా వినబడగానే అటు వెళ్లిపోయింది.

2

పక్కనున్న కుక్క మీద చేయివేసి ''జగమే మాయ'' అని పాడుతూ రోడ్డు పక్కన కూచుని వున్న దేవదాసు కుడిచేతిలో బాధనూ వేదననూ మరిపించే పానీయం గ్లాసున్నది. శ్యామ సుందరి మోడరన్ వుమన్‌లాగా ఆకర్షవంతంగా వుండి, ఆ చిత్రంలోని సీను తదేకంగా చూస్తున్నది. నవ్వు మొహమేల? దీనా సినిమా చూస్తున్నాడో లేదో చెప్పలేము గానీ, సుందిని స్టడీ చేస్తున్నాడంటే సరిపోతుంది.

''తగ్గుతున్నట్టే వుంది ఓ పక్షం గడిచింది. తెలివిగానే జవాబులిస్తూ నిలకడగా వున్నది. పన్లు అందుకుంటున్నది. జాబ్‌లో కెళ్లిపోతాననే అభిప్రాయం మెల్లిగా

వెల్లడిస్తున్నది. స్వార్థపరురాలు కాదేమో. ఫలహారం, స్వీటూ చేస్తున్నది. పిల్లలందరినీ పిలిచి పెడ్తున్నది. మర్యాదా, గౌరవం, ప్రేమా, స్నేహం అందక వికలమై వుంటుంది. అవి అందంగానే మానవత్త్వం పైకి వచ్చేస్తున్నది'' అని సంతోషిస్తున్నాడు.

''నేను చివరివరకూ చూడలేను దీనా. పోదాం రా. పారో కోసం దేవదాసు పాడై చావటమెందుకూ? ఫూల్. చంద్రముఖిని మెచ్చాడే. అది స్వాధీనపడకే రెండో హీరోయిన్‌తో వుండవచ్చునే? అది భగ్న ప్రేమగాదు దీనా. ఫూల్ ప్రేమ. ఎంత అహం ఫూల్‌కి? వెయిట్ చేయాలా ఫూల్? దెబ్బ తీయరాదా? బాగా అంటించింది ''నీకేనా తల్లిదండ్రులూ వంశ ప్రతిష్ఠా? నాకు లేవా'' కిటుకు డబ్బే, దేవదా జమిందారు బిడ్డ. పారో మిడిల్ క్లాస్'' అంటూనే లేచింది. దీనానాథ్‌ని లేవదీసి లాక్కెళ్లింది.

ఆవరణలో వున్న టాక్సీ డ్రైవరు వీరిని చూడగానే కారు డోర్ తీసిపట్టుకున్నాడు. కాని సుంది ఫ్రంట్ సీట్ డోర్ తీసి చక్రం ముందు కూచుని చక్రం బట్టింది. అటువేపుగా వచ్చి డ్రైవరు అభ్యంతరం చెప్పాడు.

''రద్దీగా వున్నప్పుడు, మీరు డ్రైవ్ చేయటం ప్రమాదం. హెవీ వెహికిల్స్, సిటీ బసెస్ రన్నవుతూ వుంటాయి. కొత్త వారిని చూడగానే బీట్ పోలీస్ లైసెన్స్ సర్వీస్ పుస్తకం చూపమంటాడు. ఇది కొత్త కారు. ఎ.సి. రన్నవుతుంది. గేరు బెట్టుగాపడుతున్నది మేడమ్. అవతలికి జరగండి''.

''యేం పరవాలేదు. నాకు లైసెన్సున్నది. మా ఆయన తానే నేర్పాడు. లైసెన్సు తానే తెప్పించాడు. నీకు అంత భయంగా వుంటే దీనాకు నాకూ మధ్య కూచో. చక్రం దగ్గరే వుంటావు. కొద్ది దూరం డ్రైవ్ చేసి నా ప్రతిభ దీనాకి చూపి నీ సీటు నీ కిచ్చేస్తా'' అన్నది చేయితిప్పుతూ. నవ్వు మొహం.

డ్రైవరు దీనానాథ్ వంక చూశాడు. దీనానాథ్ పర్స్ బైటికి తీసి ఓపెన్ చేసి వందనోటు పైకి తీసి అందిస్తూ తల వూపాడు. డ్రైవరందుకుని సుంది చెప్పినట్టే చేశాడు గానీ అతని గుండె దడదడలాడ సాగింది. సుంది డ్రైవింగ్ మతిలేని

డ్రైవింగ్‌లాగా వున్నది. యెప్పుడు దిగుతుందా యెపుడు నేను చక్రం ముందుంటానా అని చూస్తున్నాడు. యాక్సిలేటర్ మీదికి సుంది పాదం యెక్కంగానే.

" ఆపేయాలి మేడమ్. అంత వేగంగా డ్రైవ్ చేయరాదు, ఫార్టీ మైల్స్ పెర్ అవర్ అంతే" అంటూనే వున్నాడు. వేగం హెచ్చుగానే దీనాకీ డ్రైవర్‌కీ చమటలు పట్టినై.

సిగ్నల్స్ చూపే స్తంభం నాలుగు రోడ్ల కూడలి వచ్చేస్తున్నది. కారు స్లో డౌన్ కాలేదు. బీట్ పోలీస్, మరియు కార్లో వున్న హెడ్ కానిస్టేబుల్, యస్పై చూశారు. తాగి డ్రైవ్ చేస్తున్నాడని అనుమానించి పిస్టల్ తీసి టైర్ బర్స్ట్ అయేట్టు గురిచూసి పేల్చారు. స్కీచ్ అంటూ కారాగింది. కొద్ది దూరంలోనే కూడలీ వాహనాలున్నాయి. రక్షణ శాఖ దగ్గరసా వచ్చారు. స్టన్నింగ్ బ్యూటీ సుంది పకాపక నవ్వుతూ కారు డోర్ తీసి దిగింది. రక్షణశాఖ కళ్లప్పగించారు. చెయ్యి అందంగా తిప్పుతూ, కారులో వున్న దీనానాధ్‌ని చూపుతూ నవ్వుతూ అన్నది సుంది.

"దీనాయే నీ ప్రతిభ చూద్దాం నువ్వు డ్రైవ్ చేయి అంటే, సరేనన్నా" యింకా యేదో చెప్తున్నది సుంది.

దీనానాథ్, డ్రైవర్ దిగారు. జనం పోగుబడుతున్నారు. రాకపోకలాగేట్టున్నాయి.

"మిస్టర్ దీనానాథ్! మీరు డాక్టరనుకుంటా. మిమ్మల్నోసారి మానసిక వైద్య ఆలయంలో చూసినట్టు గుర్తొస్తున్నది. హిపోక్రేట్ ప్రమాణం చేసి వుండాలే. శ్యామసుందరీ దేవి గార్నీ చూశా. ఆమె మెంటల్ డిసీజ్‌కి ట్రీట్‌మెంట్ యిచ్చారనీ తెలుసు. కాని తగ్గినట్టే భ్రమ కల్పించి మళ్లా ముదురుతుందిట డిసీజ్" పోలీసులందర్నీ తరిమేశారు రాకపోకలు సాగినై.

డ్రైవర్ పున్నీర్ వచ్చి అంతా చెప్పి తప్పు ఒప్పుకుని క్షమాపణ అడిగి గబగబా స్పేర్ వీల్ తెచ్చి పరికరాలు తీసి పనిచేస్తుంటే యిద్దరు పోలీసులూ సాయం చేశారు. నిమిషాల మీద పనిపూర్తి అయింది. తొలగించిన టైర్ డిక్కీలో పెట్టాడు పున్నీర్.

''కేసు నమోదు చేస్తారా సార్? స్టేషన్కి కారు తీసుకురానా?'' అనడిగితే యస్సై తల వూపాడు. అందరూ వాహనాల్లో దూరారు.

3

''ఫూల్ లాగా వున్నావే దీనా? మీ పిన్ని అంతా చెప్పింది. ఆమె వార్నింగ్ నీ బుర్రలో దూరలేదా? ఆఫీసర్ బాగా తెలిసినవాడు గనక, కేసు నమోదు కాలేదు. వదిల్తే వదిలింది గానీ నీకు వదిలిందని బాధలేదని నాకు తెలుసునుకో, తేలికగా వదిలింది వ్యవహారం'' అన్నాడు మామయ్య జోగారావు గారు. ఆయన క్రిమినల్ లాయరూ ప్రాసిక్యూటర్గా కూడా కొన్నాళ్ళు జాబ్ చేశాడు.

''నాకేం తెల్సు మామయ్యా? అలా మారుతుంది క్షణంలో అనుకోలేదు. తగ్గిపోతున్నదనే నమ్మాను. పొల్లు మాటలు లేవు. వెకిలితనం లేదు. దుడుకు నోరు మూతబడినట్లే కనిపించింది. రోజులు సజావుగా గడిచిపోతుంటే తగ్గుతున్నదని ఆశించాను. అదీ తప్పేనా?'' అన్నాడు దీనా. విచారమే లేదు.

''ఫూల్ అలాగే ఆశిస్తాడు దీనా. రాత్రికి రాత్రి, నీకు ఫోన్ వచ్చింది. నీ పై అధికారి పిలుస్తున్నాడు. రా. దీనా. అని పిల్చుకెళ్దామనీ, మంచి నిద్రలో వున్నావేమోనని అనుకుంటూ బెడ్రూమ్లో అడుగుబెట్టి థ్రిల్లర్ చూశాను. నవ్వూ రాక యేడుపూ రాక కళ్లప్పగించి నిలబడ్డాను దీనా!'' అని రాని నవ్వు నవ్వారు జోగారావుగారు.

దీనా నిజంగానే నవ్వాడు. ''అంత తీవ్రత అంత తక్కువ టైమ్లో వస్తుందనుకోలేదు మామయ్యా'' నన్ను మోహించనదీ సినిమా కెందుకు పిలుచుకెళ్లావు? రా. రా. నీ వలపు చూద్దాం అని పెనుగులాట. సరసాలకు కుస్తీ. గుడ్డలు కట్టుకోనివ్వదు. చేతులోవి లాగేసింది. ఎంత బలం సుందికి మామయ్యా? ఆపద్బాంధవుడల్లే నువ్వు సమయానికి వచ్చి దీనానాధ్ మాన సంరక్షణ చేశావు గనక నా పరువు దక్కింది మామయ్యా. అంతలోనే నిన్ను చూడగానే కళలు మార్చి, సిగ్గిలితూ, కులుకుతూ వూగుతూ వయ్యారం ఒలికిస్తూ, గారలు పోతూ'', మనం పెళ్లి చేసుకుని వేరే వుందాం, నేను నీ కోసం

మోడరన్ ఫ్లాట్ ప్రేమనగర్లో కొన్నాను, వన్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ సుందీ, నిన్నెవరూ గౌరవంగా చూడటం లేదు, పిచ్చిదాన్ని చేసి దోచేస్తున్నారు'' అన్నది. మామయ్యా నన్ను సూచేస్తుందిట. మాట తప్పినందుకు. అహహా నమ్మలేం. అనర్గళంగా అల్లగలిగింది అబద్ధాలు. పర్స్, వాచీ హుష్‌కాకీ మామయ్యా, నేనా రభసలో గమనించలేదు'' దీనానాథ్ నిర్విచారంగా నవ్వుతూనే వున్నాడు.

''పోదామా దీనా పేయింగ్ స్టేషనది. వెయిట్ చేస్తున్నారేమో రింగ్ చేసినవాళ్లు? దగ్గరే'' మామయ్య లేచాడు.

'పై అధికారి కాదేమో మామయ్యా? మరో పక్షం శలవు పొడిగించామని నిన్న మెసేజ్ పంపారే''.

దీనానాథ్ డ్రెస్ చేసుకుని మామయ్య వెంట వీధిలో కొచ్చాడు.

ఏడు వింతలలో ఒకటిలాగా వారంటుతో సహా రక్షణశాఖవారు పోలీస్ జీప్‌లోంచి దిగి వచ్చారు. యస్పై చేతిలో అరదండాలూ, ఫార్మల్‌గా సెల్యూట్ చేసి, ''దీనానాథ్ అనే ఆఫీసర్ని అరెస్టు చేసి రిమాండ్‌లో వుంచమని ఆర్డర్సు వచ్చాయి సార్. వారికి మీరు పరిచితులే. మీ నెవ్యూ అని చెప్పారు'' అన్నాడాఫీసర్.

''నేరం తెలియనిదీ అరెస్ట్ చేయనీయను'' అన్నాడు క్రిమినల్ లాయరు జోగారావు గారు.

''దీనానాథ్ గారు ఒకరికి హామీ వున్నారు. ఐదు లక్షలకి బిజినెస్ మొదలుపెట్టి, కంప్యూటర్ అకాడమీ నడుపుతున్నట్టు చూసి షేర్ హోల్డర్స్‌ని పరిచయం చేశారు. వీరిని హామీ వుంచి లండన్ కెళ్లి మూడు వారాలకల్లా వచ్చి నీ ముందు వాల్తానని చెప్పారుట. కాని రాలేదు. బిజినెస్ తాళం పడింది. దీనానాథ్‌గారు అందకపోతే ఆయన బాంక్ యెకౌంట్, ఆస్తి ఫ్రీజ్ చేయమన్నారు సార్!'' అన్నాడు సీరియస్‌గా చూస్తూ.

''కీస్, కొత్త కారు ఇగ్నీషన్ కీస్ ఆయన వద్దే వున్నాయి. అవీ కావాలి. మారుతీ డీలక్స్ అయిదు లక్షలు'' అన్నాడు నింపాదిగా.

'' ఐసీ నేరం పెద్దదే. అయినా పేర్లు, అడ్రస్‌లూ తెలుసుకుని నేనే నా

నెప్ప్యాని మీకు అప్పగిస్తాను'' అని అందర్నీ పరిశీలనగా చూచాడు లాయరుగారు. పేర్లు విన్నాక దీనానాధ్ వంక చూచారు ''వెర్రి కుట్టె'' అని మనస్సులోనే అనుకుని, ''దీనా! మై డియర్! యూ ఆర్ రియల్లీ యె ఫూల్''. పేరనాయిడ్‌తో తాను నష్టపోతూ యితరులను బురదలో కీడుస్తూ, సమయం చూసి నెత్తిన చేయిపెట్టి ఆనందించే, అసత్యాన్ని ఆరాధించే కపర్దికి హోమీ వున్నావా? వాడు పేర్లూ మారుస్తాడు ప్లేటూ ఫిరాయిస్తాడు, హరినారాయణ, ఆదికేశవులు పేర్లున్నాయి. యింతకు ముందు, ఫిల్మ్ ఇండస్ట్రీలోని వారికే బురిడీ వేయగలిగితే నువ్వనగా యెంత?'' అని నవ్వు. రక్షణశాఖవారిని చూసి, ''వాడు చదరంగం ఎడిక్ట్. అన్ని పావులు చచ్చినా రెండు బంట్లు అని చెప్పబడే పావులతో ఆటకట్టించగలడు. వాడిని తేలిగ్గా పట్టిస్తా రండి సార్. కపర్ది లండనూ వెళ్లలేదు, స్టేట్స్‌కీ వెళ్లలేదు. ఎయిర్‌పోర్ట్‌లోనే పట్టేస్తారు కపర్దిని. వాడి ఫొటో వేలిముద్రలూ వున్నాయి వారి వద్ద. నా సాయంకావాలన్నప్పుడు నేనే సప్లయ్ చేశావాటిని. సైకో అని డాక్టరు చేత సర్టిఫై చేయించి విడిపించింది నేనే సార్. మీరు కపర్దిని పట్టుకుని, యెవరి బుర్ర పదునుగా వున్నదీ తేల్చుకోవాలి. వాడి ఆధీనంలో వున్న వాటిని నేర్పుగా వాడు వాడిన నాణెమే వాడి ముందు స్వాధీనం చేసుకోండి'' అని పకపకా నవ్వాడు నిలబడి వున్నవారికీ నవ్వు ఆగింది కాదు. ''యెందుకు సార్ అంత నవ్వు? మాక్కూడా చెప్పండి'' అన్నాడాఫీసర్.

'' ఒక విధంగా శివుడు గూడా, మా దీనానాధ్‌లాగా ఫూలే అనాలి. ఇవ్వగూడని వరమిచ్చి తన నెత్తి మీదికే డేంజర్ తెచ్చుకున్నాడు గాదా! నేను వచ్చినట్టు సమయానికి హరి మోహినీ అవతారమెత్తి వచ్చి వాడి చేయి వాడి నెత్తినే పెట్టించాడుగదండీ''

అందర్నీ వాహనాలెక్కమని తానూ యెక్కాడు మామయ్య.

4

దీనానాధ్‌కి సెండాఫ యివ్వటానికి, విమానాశ్రయానికి, తన స్వంత మారుతీ డీలక్స్ కారులో తెచ్చాడు జోగారావు గారు.

చెకింగ్, లగేజ్ పనీ, అఫీషల్ పేపర్లు వెరిఫై చేయించటం ముగిసి కుర్చీలో కూచున్నారిద్దరు.

"కపర్ది అంత మూర్ఖుడని వూహించలేక పోయినా మామయ్యా. అంతా పరిచితులే అఫిషల్ పేపర్సూ చూపాడు కపర్ది. మంచి జాబ్‌లోనే వున్నాడు. బిజినెస్ పెట్టి పైకి పైకి రావాలని ఆశిస్తున్నాడని అనుకున్నానంతే. "మూడు వారాల కల్లా వచ్చి నీ యెదుట వాలనూ దీనానాధ్? అక్కడ మనవాళ్లున్నారు. వాళ్లా షేర్‌హోల్డర్స్ అవుతామని ఫోన్ చేశారు. అన్నీ మాట్లాడుకుందాం రమ్మనీ ఖర్చులు తమవేననీ అన్నారు" అంటే నమ్మాను మామయ్యా. అందర్నీ అనుమానించే స్వభావం కాదు నాది. నిజంగా హరిలాగే వచ్చి చక్రం తిప్పి చాకచక్యంగా రక్షణ శాఖవారి అనాలోచితపనులూ చూపావు వారికి. నన్ను నా జాబ్‌లోకి సురక్షితంగా గౌరవంగా పంపుతున్నావు మామయ్యా. నీ ఋణం తీర్చలేనేమో" దీనాకి విచారమే లేదు. వెంట్రుకవాసిలో పీడ తొలగించాడు మామయ్య. కాస్తా కూస్తా గాదు పదిలక్షలు అర్పించాల్సిన బాధ తప్పింది.

"నాటెటాల్ దీనా! అంత దయుగా వుంటే ఫూల్‌ని చేస్తారని నా అభిప్రాయం. వంచించటం రాకపోయినా, కనీసం వంచకులను గుర్తించటమన్నా రావాలి. ప్రపంచం తీరు తెన్నులు చూసిన, ప్రపంచ జ్ఞానం వున్న వారే అటువంటి కాగితాలు చూసీ వంచన వూహించలేక, అంతా తెలిసిన వారే గదా అనే భరోసాతో వారికి చిక్కి నష్టపోయాక అంతా మోసమని గ్రహించి, "తెలివి యొకింతలేని యెడ తృప్తుడనై కరిభంగి సర్వమున్ తెలిసితినంచ, గర్వితమతినై" అన్నాడు కవి.

వారంతా ఫేక్ పిడబ్ల్యుజి వంటి వారు, ఆ కాగితాలన్నీ ఫేక్. దొంగ నోట్లే మంచినోట్లతో కలిసి లక్షల్లో రవాణా అవుతున్నాయి. పెద్ద మనుషులల్లె నటించేవారు, నిజంగా పెద్ద మనుషులేనందామా? లే. అనౌన్స్ చేశారు. చెకింగ్ రూమ్ వేపు నడుస్తున్నారు యీ ఫ్లైట్‌లో వెళ్లేవారు" అని లేచాడు లాయరు మామయ్య. దీనా లేచాడు.

మామయ్యను ఆలింగనం చేసుకుని, కరచాలనం చేసి కృతజ్ఞతలు చెప్పి సంచీ అందుకున్నాడు దీనా.

''సిక్‌లీవ్ థ్రిల్లింగా, రసవత్తరంగా గడిపావు దీనా. కంగ్రాట్స్'' అన్నారు జోగారావుగారు.

దీనా నవ్వుతూ చెకింగ్ రూమ్ వేపు వెళ్లాడు.